క్లుప్తంగా

అరుణాచలంకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

పటమట(విజయవాడతూర్పు): ఏపీఎస్ ఆర్టీసీ ఆటోనగర్ డిపో ఆధ్వర్యంలో అరుణాచలంకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు కె. ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వీసులు ఈనెల 25 రాత్రి 10 గంటలకు ఆటోనగర్ బస్ స్టేషన్ నుంచి 10.45 గంటలకు విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. 25న విజయవాడలో బయలుదేరిన బస్సు 26నఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం కాణిపాకం, సాయంత్రం గోల్డెన్ టెంపుల్ చేరుకుని రాత్రి అక్కడి నుంచి బయలుదేరి 27న ఉదయం అరుణాచలం చేరుతుందన్నారు. అక్కడ గిరి ప్రదక్షిణ, దర్శనం అనంతరం ఆదేరోజు సాయంత్రం అరుణాచలం నుంచి బయలుదేరి 28న ఉదయం 05.00 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. ఈ యాత్రకు రాను పోను ఛార్జీ రూ.2,500(బస్ ఛార్జీ మాత్రమే) నిర్ణయించామని, 95289 సర్వీస్ నంబర్‌తో ఆన్ లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించామని ఆయన తెలిపారు. వివరాలకు 7382899266 ఫోన్లో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు సామర్థ్య సర్వే పరీక్షలు



పాయకాపురం(విజయవాడరూరల్): కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో నిర్వహించిన 6, 9వ తరగతి చదివే విద్యార్థులకు సామర్థ్య సర్వే పరీక్షలు 62వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం జరిగాయి. 6వ తరగతి నుంచి 30 మంది, 9వ తరగతి నుంచి 30 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో ఇంగ్లీషు నుంచి 30, గణితం నుంచి 30 ప్రశ్నలు 9వ తరగతి విద్యార్థులు రాయడం జరిగింది. అలాగే 25 ప్రశ్నలు ఇంగ్లీషు నుంచి 25 ప్రశ్నలు గణితం నుంచి 6వ తరగతి విద్యార్థులు రాశారు. స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే 2023లో విద్యార్థులు పాల్గొని విజయవంతంగా పరీక్షలు రాసినట్లు హెచ్ఎం మైనం హుస్సేన్ తెలిపారు.

ఎస్ఆర్ఆర్‌లో విజిలెన్స్ వారోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు.. అవినీతి రహిత సమాజ స్థాపనలో విద్యార్థుల పాత్రపై అనర్గళంగా ప్రసంగించారు. కళాశాల అధ్యాపకులు ఎస్. శ్రీకాంత్, పీఎల్ఎస్. దాసు, సుచరితలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజిలెన్స్ సిఐ జి.వ సంతబాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. వక్తృత్వ పోటీల్లో పి.విజయ్ ప్రథమ స్థానం, గోపీచంద్ ద్వితీయ స్థానం, జి.గణేష్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు పటమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగే అవినీతి నిరోధక వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ వసంతబాబు తెలిపారు.

మధురంగా సాగిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: మహీ స్వరాలు ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. సీనియర్ గాయని మల్లీశ్వరి పర్యవేక్షణలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు వెన్నెల పద్మశ్రీ, ఓలేటి లక్ష్మి, శైలజ, లక్ష్మీతులసి, అమృతవల్లి, గౌస్, రహీమ్, కౌశిక్, గణేష్, దిలీప్, డీటీ సాయిబాబా పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. నిర్వాహకురాలు మల్లీశ్వరి మాట్లాడుతూ గాయనీ గాయకులు స్వయం కృషితో విజయాలు సాధించాలని, తమదైన ముద్రను ఏర్పాటు చేసుకొని రాగ, తాళ యుక్తంగా పాడాలని సూచించారు. అనంతరం గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. టీవీ శేషగిరిరావు, పి.శ్రీనివాసరావుపాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగికి డాక్టరేట్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వార్డు సచివాలయ ఉద్యోగి ఎంవి.కాశేశ్వరరావు కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ పట్టాను శుక్రవారం అందుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎటపాక మండలం, తోటపల్లి గ్రామానికి చెందిన కాశేశ్వరరావు విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలోని వార్డు సచివాలయంలో పనిచేస్తున్నారు. అర్థశాస్త్రంలో 'ఏ స్టడీ ఆన్ ది అగ్రికల్చరల్ ఇన్డెబ్టెడ్నెస్ ఆఫ్ ట్రైబల్ ఫార్మర్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు ఐ.టి.డి.ఎ, భద్రాచలం' అనే అంశంపై కాశేశ్వరరావు పరిశోధన చేసినందుకు గాను కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టరేట్ పొందిన కాశేశ్వరరావుకు మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ప్రజల సంక్షేమమే పరమావధిగా పాలన

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



29వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పడంతో ప్రజల్లో సంతృప్తి స్థాయి నూటికి నూరు శాతం చేరిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 28వ డివిజన్ 208వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం పాల్గొన్నారు. ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందించిన సంక్షేమాన్ని పారదర్శకంగా బుక్ లెట్ల ద్వారా వివరించగల్గిన ఏకైక ప్రభుత్వం దేశంలో జగనన్న ప్రభుత్వం ఒక్కటేనని చెప్పుకొచ్చారు.

డిసెంబర్ నాటికి ఆర్‌యూబీ పనులు పూర్తి...

డిసెంబర్ నాటికల్లా రైల్వే అండర్ బ్రిడ్జి పనులను పూర్తిచేస్తామని ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. కొబ్బరితోట ప్రాంత ప్రజల ఇంటి పట్టాల సమస్యను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

బాబు హయాంలో పేట్రేగిన ఇసుక మాఫియా

చంద్రబాబు హయాంలో జరిగిన అవినీతి తవ్వేకొద్దీ బయటపడుతోందని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. బాబు పాలనలో అడ్డగోలు ఇసుక దోపిడీ జరిగినట్లు 2019 ఏప్రిల్ 4న సాక్షాత్తూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) స్పష్టం చేయడం జరిగిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల పేరుతో అప్పటి కేబినెట్ మంత్రులు, ఎమ్మెల్యేల కనుసన్నల్లో ఇసుక మాఫియా నడిచిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇసుక విధానంపై ఇష్టానుసారంగా తమకు అనుకూలంగా నిర్ణయాలు మార్చుకుంటూ దాదాపు 19 సార్లు జీవోలు ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ హయాంలో యథేచ్ఛగా సాగిన ఇసుక మాఫియాపై కొరడా ఝుళిపించిన సీఐడీ.. కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ అధికారులు, డీఈ(వాటర్–యూజీడీ) రామకృష్ణ, సీడీఓ జగదీశ్వరి, నాయకులు కంభం కొండలరావు, షేక్ అక్బర్, గోవింద్, హరిబాబు, సుధాకర్, పూర్ణిమ, నాగమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 73.35 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



మధురానగర్‌లో నూతనంగా నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 29వ డివిజన్ మధురానగర్‌లో రూ.73.35 లక్షల విలువైన అభివృద్ధి పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. గత నాలుగున్నరేళ్లలో డివిజన్లో రూ. 4.60 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. రూ. 28 లక్షలతో రామాలయం వీధి రోడ్డు, రూ. 30 లక్షలతో తోట కేదారేశ్వరరావుపేట రోడ్డును నిర్మించుకున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాంతవాసులకు ఆరోగ్యకర వాతావరణాన్ని కల్పించడంలో భాగంగా రూ. 15.35 లక్షలతో నూతన శానిటరీ కార్యాలయాన్ని నిర్మించి ప్రారంభించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు, షేక్ అక్బర్, గోవింద్, సుధాకర్, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బ్లాక్ స్పాట్స్ గుర్తించేందుకు ప్రణాళిక రూపొందించాలని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో పోలీస్, ట్రాన్స్‌పోర్టు, నేషనల్ హైవే, ఆర్అండ్‌బీ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని రోడ్లను పరిశీలించి రోడ్డు ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాలని గతంలో తాము హెచ్చరించగా.. అధికారులు అందరూ తమ నివేదికను కమిషనర్‌కు సమర్పించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్లను గుర్తించామని ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రిలో వద్ద సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నగరంలో రోడ్ల వెంట అక్రమ ఆక్రమణలను కూడా తీసివేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నగర పరిధిలో ఉన్న ప్రతి రోడ్డు పునః తనిఖీ చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోకముందు, తీసుకున్న తర్వాత ఫొటోలతో ఒక నివేదికను తనకు సమర్పించాలన్నారు.

బస్ షెల్టర్ల ఆధునీకీకరణ..

నగరంలో ఉన్న బస్సు షెల్టర్ లను గుర్తించి అవసరమైతే లైట్లను ఏర్పాటు చేయాలని, బస్‌స్టాప్‌లో సైన్ బోర్డులు పెట్టాల్సిన అవసరం ఉంటే బోర్డులను అమర్చాలని సూచించారు. అలాగే బస్ స్టాప్‌ల వద్ద అక్రమ ఆక్రమణలను తొలగించాలని, రోడ్డు ప్రమాదాలకు దారి తీసే హోర్డింగ్లను గుర్తించి వాటిని తీసివేయమని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ట్రాన్స్‌పోర్ట్ డిపార్టుమెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, జి. వి.ఎస్.డి. మూర్తి, ఏపీఎస్ ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ బి. శ్యాంప్రసాద్, ఆర్అండ్‌బీ డీఈఈ వై.శశిభూషణ్, నేషనల్ హైవే -డీఈఈ, ఎం. శ్రీనివాసరావు, ఏసీపీ పోలీస్ డిపార్ట్‌మెంట్ (ట్రాఫిక్)– ఆర్. రామచంద్ర రావు, వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఎం. ప్రభాకర్, రావు, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ సిటీ ప్లానర్ జీ.వి.జీ.ఎస్.వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాగ్గేయకార కృతులకు గాన ప్రతిష్ట



గాత్ర కచేరీ చేస్తున్న వందన

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసురాలు ప్రతాపగిరి దుర్గాదేవి జయంతి సందర్భంగా శృంగేరీ శారదాపీఠం ప్రాంగణంలోని శ్రవణ సదనంలో విఖ్యాత గాత్ర సంగీత విద్వాంసురాలు డాక్టర్ కె.వందన వాగ్గేయకార కీర్తనలకు గాన ప్రతిష్ట చేశారు. సంగీత త్రిమూర్తులు సద్గురువులు త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి రచించిన కీర్తనలను మధురంగా ఆలపించారు. హైదరాబాద్‌కు చెందిన శివానీ వయొలిన్‌పై, తిరుపతికి చెందిన కోటిపల్లి రమేష్ మృదంగంపై, గుంటూరుకు చెందిన హరిబాబు ఘటంపై వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో మోదుమూడి సుధాకర్, అచల శంకరనాథ్, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు



57వ డివిజన్‌లో జగనన్న సురక్ష కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదలకు నాణ్యమై వైద్య సేవలు అందుతున్నాయని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ప్రకాష్‌నగర్‌లోని అర్బన్ హెల్త్‌సెంటర్ 271వ వార్డు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా వుండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. సురక్ష క్యాంపుల్లో పేదలకు నాణ్యమైన వైద్యసేవలను వైద్యులు అందిస్తున్నారని, కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు, కళ్ల జోళ్ళు, మందులను ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. శిబిరంలో 700 మందికి వైద్య సేవలను అందించి మందులను ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఆలంపూరు విజయలక్ష్మీ, పార్టీ నాయకులు ఆలంపూరు విజయ్, కె.వీరబాబు, రామిరెడ్డి, బోరా బుజ్జి, హైమావతి, గ్రేస్సీ, సావిత్రి, సుభాన్, మస్తాన్, మహేష్, డాక్టర్లు రాజా, రాథోడ్ పాల్గొన్నారు.

57వ డివిజన్‌లో...

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరీపేటలోని 236వ వార్డు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందుతోందని, ముఖ్యంగా నిరుపేద ప్రజలకు అన్ని విధాలుగా జగనన్న ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే పేదవారందరూ తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తుంటారని అటువంటి వారి ఆవేదనను ప్రత్యక్షంగా వీక్షించిన జగనన్న నేరుగా ప్రతి గడపకు ఉచితంగా వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. జగనన్న సురక్ష వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా విద్యారంగ సర్వే

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే శుక్రవారం విజయవంతంగా జరిగింది. జిల్లాలోని 17 మండలాల్లో 453 పరీక్ష కేంద్రాల్లో 22,405 మందిలో 21,236 మంది విద్యార్థులు ఈ సర్వేలో పాల్గొన్నారు. ముందుకు నిర్ణయించిన విద్యార్థుల సంఖ్యలో 1,169 మంది గైర్హాజరయ్యారు. 94.78 శాతం విద్యార్థులు సర్వేలో పాల్గొని పరీక్షను పూర్తి చేశారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు పటమటలోని వీఎంసీ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్‌ను పరిశీలించి అక్కడ విద్యార్థులతో ముచ్చటించారు. పరీక్ష తీరును పరిశీలించారు. అలాగే జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక, ఉపవిద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్‌లు జిల్లాలోని వివిధ విద్యాసంస్థలను పరిశీలించారు. అదేవిధంగా 10వ తరగతి విద్యార్థి, విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. జీవ శాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులలో ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా వివిధ సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యాంశాలను చూసి నేర్చుకొనే విధానాన్ని వివరించారు. అలాగే అర్బన్ ఇన్‌స్పెక్టర్ కెజె రవికుమార్, ఇతర అధికారులు ఉమర్‌అలీ ఆయా పాఠశాలలను తనిఖీ చేశారు.

● అదిరేటి 'జీన్స్' మేమేస్తే..





జీన్స్ రీసైకిల్ షో ఆకట్టుకుంది. జీన్స్ వ్యర్థాలతో తయారు చేసిన దుస్తులను ధరించిన విద్యార్థులు ర్యాంప్ వాక్ చేసి అదరగొట్టారు. సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జీన్స్ రీసైకిల్ షోను ఆ సంస్థ డైరెక్టర్ అల్తాఫ్ హుస్సేన్‌తో కలిసి. సంస్థ అధిపతి సమన ముసావి శుక్రవారం ప్రారంభించారు. ఫ్యాషన్ టెక్నాలజీ చదివిన విద్యార్థులకు ఫ్యాబ్రిక్ డిజైనింగ్‌లో అపార అవకాశాలుంటాయని వారు చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

– లబ్బీపేట(విజయవాడతూర్పు)

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ జానారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డి అన్నారు. స్థానిక 30వ డివిజన్ దేవీనగర్ 4వ రోడ్డులోని మేజర్ డ్రెయిన్‌పై నివాసితులను జానారెడ్డి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ డ్రెయిన్‌పై నివాసం ఏర్పాటు చేసుకుని ఎన్నో అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్న నివాసితులకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకుగానూ అధికారులు సూచించిన విధంగా నివాసితులు సహకరించాలని కోరారు. ఎన్నో ఏళ్ళుగా ఉన్న తమ చిరకాల సమస్యను నెరవేర్చడం పట్ల స్థానికులు, మేజర్ డ్రెయిన్‌పై నివాసం ఉంటున్న 42 కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు జేడీ అమృతలత, సీడీఓ జగదీశ్వరి, సీఓ సాగర్ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి ఆధారిత కోర్సులకు ప్రాధాన్యం



ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అకడమిక్ కౌన్సిల్ సమావేశం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు ఉపాధి ఆధారిత కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అకడమిక్ సమావేశంలో నిర్ణయించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన అకడమిక్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం జరిగింది. కృష్ణా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ డాక్టర్ సూర్యచంద్రరావు, ప్రొఫెసర్ ఎల్.సుశీల, డాక్టర్ ఎం.కోటేశ్వరరావు యూనివర్సిటీ నామినీలుగా వ్యవహరించారు. కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ లభించడం కళాశాలలో వసతుల కల్పనపై చర్చించారు. డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ మేనేజర్ ఎ.సుధాకర్ కళాశాలలకు ఇండస్ట్రీలకు మధ్య ఉండే ప్రాముఖ్యతను వివరించారు.

రుతుక్రమ సమస్యలపై అవగాహన కల్పించాలి


కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రుతుక్రమ సమస్యలపై స్వేచ్ఛగా చర్చించుకుని పరిష్కరించుకునేలా మహిళలు, బాలికలకు అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు జిల్లా మెన్స్ట్రువల్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎంహెచ్ఎం) కమిటీ సభ్యులకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ అధ్యక్షతన వర్చువల్‌గా జిల్లా ఎంహెచ్ఎం కమిటీ సమావేశం జరిగింది. యూనిసెఫ్ సహకారంతో ఏర్పడిన ఈ ప్రత్యేక కమిటీ లక్ష్యాలు, వాటిని చేరుకునేందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు కమిటీ లక్ష్యాలను చేరుకునేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. అవసరమైన శానిటరీ న్యాప్కిన్స్ అందుబాటులో ఉంచుతూ ఆరోగ్య పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. అవగాహనా రాహిత్యం, సంప్రదాయ కట్టుబాట్లు కారణంగా రుతుక్రమంపై మాట్లాడాలంటేనే అదేదో తప్పుగా భావిస్తారని.. ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడి ధైర్యంగా, స్వేచ్ఛగా ఆ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొంటూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. వీటిపై బాలికలు, మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కిశోర బాలికలు, గ్రామీణ ప్రాంత మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, యునిసెఫ్ ప్రతినిధి డాక్టర్ ప్రభాత్, ఎస్ఎల్ఎన్ రెడ్డి, గోవింద రాజులు, శైలు, అనురాధ పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం



మధురానగర్(విజయవాడసెంట్రల్): కుమారుడు కనిపించడం లేదంటూ గుణదల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురానగర్ పప్పులమిల్లు ప్రాంతానికి చెందిన ఎం.మురళి, లక్ష్మీల కుమారుడు మోహిత్‌తేజ(10) ఐదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల ఒకటో తేదీ అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. తల్లితండ్రులు చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద విచారించినప్పటికీ ఫలితం లేకపోవడంతో గుణదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్టీవీఆర్ విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు బయలుదేరిన విద్యార్థినులతో పాఠశాల హెచ్ఎం సూర్యప్రభ

మధురానగర్(విజయవాడసెంట్రల్): నెల్లూరు జిల్లా ఆత్మకూరులో శనివారం నుంచి జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు దుర్గాపురం ఎస్టీవీఆర్ నగర పాలక సంస్థ పాఠశాల విద్యార్థినులు శుక్రవారం బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎం.సూర్యప్రభ, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు విద్యార్థినులు పావని, సునీతలను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉన్నతంగా రాణించి పాఠశాలకు జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నగరంలో నరకాసుర చిత్ర యూనిట్ సందడి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలో నరకాసుర చిత్ర యూనిట్ సందడి చేసింది. నగరంలోని స్వర్ణాప్యాలెస్ థియేటర్‌లో చిత్రం విడుదల సందర్భంగా యూనిట్ సభ్యులు ప్రేక్షకులతో కలిసి చిత్రాన్ని వీక్షించారు. చిత్ర కథానాయకుడు రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ సెబాస్టియన్ నోవా దర్శకత్వంలో వచ్చిన నరకాసుర పూర్తి సందేశాత్మక చిత్రమని పేర్కొన్నారు. విడుదలైన రోజే ప్రేక్షకుల నుంచి అపూర్వ స్పందన లభించిందని తెలిపారు. ఈ చిత్రం ఏపీ, తమిళనాడు సరిహద్దుల్లో కాఫీ, మిరియాల ఎస్టేట్ నేపథ్యంలో సాగుతుందన్నారు. తనది విజయవాడేనని గతంలో పలాస సినిమా చేశానని, ఆ సినిమాను కూడా ఆదరించారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అట్లూరి ప్రసాద్ కృష్ణాజీ, అన్నపూర్ణ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ పి.వి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.